

# తోడొకరుండిన....

– శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**చిన్నప్పటి లాగానే** తరుణిది బాగా పెద్దదైన డూప్లెక్స్ ఇల్లు. చాల పొందికగా అమర్చి వుంది. హాల్లో పెద్ద అలమారులో నీట్‌గా పుస్తకాలు అమర్చి వున్నాయి.

కుసుమకు గెస్ట్ రూంలో ఎకామడేట్ చేసింది తరుణి. ఒక్కడే కొడుకు పెళ్ళయింది. ఫామిలీ బిజినెస్ చూసుకుంటూ ఇండియాలోనే వుంటూనే తరుచుగా విదేశాలకు వెళ్ళివస్తూ వుంటాడు. ఆమె భర్త విక్రం కూడా బిజినెస్ వ్యవహారాలన్ని కొడుక్కు అప్పగించి తాను మామగారి అడుగుజాడలలో సోషల్ సర్వీస్ ఏక్టివిటీస్తో బిజీగా వుంటాడు.

ఆయన ముఖ్యంగా సీనియర్సిటిజెన్స్ ప్రాబ్లెంస్ మీద దృష్టి పెట్టి ఆ దిక్కుగా తన సేవా కార్యక్రమాలు చేస్తూ వుంటాడు.

తరుణి అటు భర్తకు, ఇటు కొడుక్కు కూడా తన సహాయసహకారాలు అందచేస్తూ వుంటుంది.

పూర్ణిమ భర్త నిరంజన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయి, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో పార్ట్‌టైం జాబ్ చేస్తూ వున్నాడు. ఆమెకు ఇద్దరూ కూతుళ్ళే. పెళ్ళిలయి సెటిలయి వున్నారు.

రేణుక భర్త డాక్టర్ ఆనంద్ కార్డియాలజిస్ట్. కార్పొరేట్ హాస్పిటల్ లో సర్వీస్ చేస్తూనే విక్రం నడుపుతున్న సీనియర్ సిటిజెన్ సంస్థలో కన్సల్టెంట్‌గా వెళ్ళుతూంటాడు.

ఈ మూడూ కుటుంబాలు కూడా సన్నిహితంగా మెలుగుతూంటాయి.

వారందరికి కూడా వీరి ఫ్రెండ్‌షిప్ గురించి కుసుమ గురించి తెలుసు. ముందుగానే భార్యలు ఫోన్లలో వారిని హెచ్చరించి వుంచారు. కుసుమ ఏదో బాధలో వున్నది. తనంతట తాను బయట పడేదాకా ఆమె పర్సనల్ విషయాలు ఏవీ అడగదలచుకోలేదని కూడా చెప్పారు.

హాల్లో కాలుపెడుతూనే పుస్తకాల్ రాక్ చూసిన కుసుమకు కళ్ళు విప్పారాయి. రాక్ దగ్గరకు వెళ్ళి "వావ్ తరుణీ ఎంతమంచి కలెక్షన్! ఈ పుస్తకాలను చూస్తుంటే మళ్ళీ చిన్నప్పటిలాగా అన్ని చదివి డిస్కస్ చేస్తూ కాలక్షేపం చేద్దామని వుంది." ఒక్కొక్క బుక్ తెరిచి చూస్తూ ఎక్సయిట్ అయింది.

"మరే. ఇప్పటికి నేనూ పూర్ణిమా అదేపని చేస్తూ వుంటాము. పాపం రేణుకు అంత టైం వుండదు. కాని తను కూడా చదువుతూనే వుంటుంది. మేము ముగ్గురము కలిస్తే ఎక్కువగా పుస్తకాల గురించే చర్చించుకుంటాము."

"ఆ రోజులలో లాగా తెలుగులో అంత చెప్పుకోదగ్గ పుస్తకాలు తక్కువయినయి. ఇప్పుడు ఇంగ్లీష్ లో చాల మంచి ఫిక్షన్, జెనరల్ బుక్స్ బాగా వస్తున్నాయి."

ఒక రాక్ మొత్తం సిడ్నీ షెల్డన్, జెఫ్రీ ఆర్చర్, రాబిన్ కుక్, ఆర్థర్ హైలీ వంటి ప్రఖ్యాత రచయితల పుస్తకాలు వున్నాయి.

ఒక వారపత్రికలో ఒక రచయిత సరదాగా ఒక ఆర్టికల్ రాశాడు. అందులో రెండవ అతను వ్రాస్తున్న నవలలకు మూలం అన్నీ ఇంగ్లీష్

నవలలు, అంటూ ఆయా నవలకు మూలమైన ఇంగ్లీష్ నవలల పేర్లన్నీ ఇచ్చాడు. దాంతో నాకు కుతూహలం పెరిగి ఆ ఇంగ్లీష్‌నవలలన్నీ సేకరించి చదవటం మొదలెట్టాను. ఇంక అక్కడి నుండి వెనక్కి తిరగలేకపోయాను. ఆ ఇంగ్లీష్ రచయితలకు వీరాభిమానిని అయి వచ్చిన పుస్తకం వచ్చినట్టు కొని కలెక్ట్ చేసి ఇదిగో ఈ లైబ్రరీ బిల్డ్ చేయగలిగాను."

అట్లా టాపిక్ పుస్తకాల నుండి సినిమాలు నేటి రాజకీయాల దాకా సాగి పోతూనే వున్నది.

ఆపాటికి రాత్రి అయింది. పూర్ణిమ రేణుక అక్కడే వుండిపోయినారు. నిరంజన్ ఆనంద్‌కు ఫోన్ చేసి తరుణి ఇంటికే డిన్నర్‌కు వచ్చేయమని చెప్పటంతో మూడు ఫామిలీస్, కుసుమ భోజనాలు చేసి బయట లాన్లో కూర్చొని సరదాగా కబుర్లుచెప్పుకున్నారు.

విక్రం మంచి కలుపుగోలు మనిషి. అతను కబుర్లు చెప్పుతుంటే సమయం ఇట్టే గడిచిపోతుంది. ఆయనతో సమానంగా నిరంజన్ ఆనంద్ కూడా జోకులేసుకుంటూ అరమరికలు లేకుండా మాట్లాడుతూ వుంటే సమయమే తెలియదు.

కొంత సేపటికి కుసుమలో గూడుకట్టుకున్న ఆ అభద్రతా భావం మెల్లిమెల్లిగా మంచుపొరలాగా కరిగిపోసాగింది. మొదట్లో మొహమాటంగా వున్నా రానురాను ఫ్రీగా మాట్లాడసాగింది.

నలుగురు స్నేహితురాళ్ళు ఒకటే గదిలో పడుకోవటానికి వుపక్రమించారు.

"రేణూ నీ రేపటి ప్రోగ్రాం ఏమిటే?"

"అంత ఇంపార్టెంట్ కేసులేమీ లేవు. ఏవైనా వుంటే ఫోన్ చేయమని చెప్పే వచ్చాను. ఫోన్ రాకపోతే రోజంతా ఫ్రీనే."

"పూర్ణి, నీ సంగతి......."

"బిందాస్. రేపంతా ఎంజాయ్."

"సరే అప్పుడే టైం పదకొండవుతోంది. ఇంక పడుకుంటే సరి."

కుసుమ తన బాగ్ లోంచి మందుల డబ్బా తీసింది. రేణుక ఓరకంటితో చూసింది. నాలుగు టాబ్లెట్స్ తీసి వేసుకుంటూన్నది. ఏమీ ఎరగనట్టే ఆ మందుల స్ట్రిప్స్ చేతిలోకి తీసుకొని చూసింది. బిపి టాబ్లెట్, ఏంటీ డిప్రెషంట్, నిద్రమందు, కొలెస్ట్రాల్ టాబ్లెట్ ఒక్కొక్కటి.

కుసుమ నిద్ర లేచేటప్పటికి అందరూ ఎవరిపనుల్లో వాళ్ళు వున్నారు.

టైం చూసింది. బాపురే ఎనిమిది దాటింది. ఛీ, ఏంటిది ఇంట్లోలాగా ఇక్కడ కూడా ఇంతపొద్దెక్కి లేవటం? అసహ్యంగా అనిపించింది. బాత్రూం లోకి వెళ్ళి కాలకృత్యాలు ముగించుకొని స్నానం కూడా చేసి తయారయి బయటికి వచ్చింది.

"అబ్బా ఏమిటో చాల నాళ్ళకు మొద్దు నిద్ర పట్టేసింది." సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు అన్నది.

మరి అంత పవర్‌ఫుల్ మందులు వేసుకుంటే మొద్దు నిద్ర పట్టక ఏమవుతుంది? మనసులోనే అనుకొని, "దాందేముందే! కొత్త చోటు కదా! రాత్రి చాల సేపు నిద్ర పట్టక పొర్లుతూనే కనిపించావు. రా. బ్రేక్‌ఫాస్ట్ చేద్దాం." తరుణి సర్ది చెప్పింది.

"రేణూ, మీ ఆయన ఫోన్ చేసాడు కదా, వెళ్ళాలా?"

"అంత హడావుడి ఏమీ లేదు. సాయంత్రం ఏదో ఒక కేస్ వుంది. అప్పటికి వెళ్ళితే సరి. సాధారణంగా శని ఆదివారాలు ఎమర్జెన్సీ కేసులు వస్తే తప్ప క్లినిక్ తెరువను. అందులో ఈ వేళ రోజంతా మీతోనే స్పెండ్ చేసే మూడ్‌లో వున్నాను.

పదపద. ఈ రోజు సామూహిక వంటల కార్యక్రమం పెడదాము. ఏం కుసుమా? నీ భోజన అలవాట్లు పాతవేనా? ఏమైనా మారాయా?"

"ఆఁ ఏంటీ?" ఏదో పరధ్యానంగా శూన్యంలోకి చూస్తూవున్న కుసుమ ఈ లోకంలోకి వచ్చినట్టు అడిగింది.

"ఎన్ని రుచులు మారినా చిన్నప్పుడు మీ ఇంట్లో నాయనమ్మ పిన్ని వాళ్ళు రోట్లో రుబ్బుతుండగా చేతుల్లో పెట్టించుకొని నాకుతూ వుండే కందిపచ్చడి రుచి మటుకు జన్మలో మరిచిపోలేను." తేరుకొని మామూలుగా అవటానికి ప్రయత్నం చేయసాగింది.

నలుగురు ఒక్కసారిగా మళ్ళీ గతం కళ్ళముందుకొచ్చింది.

నాయనమ్మ కంది పప్పు వేయించి పచ్చడి రుబ్బటానికి రోటి దగ్గర కూర్చోగానే పిల్లలందరూ ఆ కమ్మటి వాసన పసిగట్టి రోటి చుట్టూ చేరేవారు. ఎప్పుడెప్పుడు పచ్చడి రుబ్బటం పూర్తవుతుందా అని కాచుకు కూర్చునే వారు. రుబ్బటం అయిపోగానే పిల్లలందరికీ చేతుల్లో తలా ఒక ముద్ద పెడితే నాక్కుంటూ ఆనందించటం జ్ఞాపకం వచ్చింది.

"ఓరి భడవల్లారా! రుబ్బిన పచ్చడంతా మీ చేతుల్లో పెట్టటానికే సరిపోతే ఇంక అన్నాల్లోకి ఏంతింటారర్రా? అమ్మాయీ ఇంకో సోలెడు పప్పు వేయించవే. మళ్ళీ రుబ్బుతేనే ఇంక రాత్రి అన్నాల్లోకి పచ్చడి." అంటూ నాయనమ్మ పైకి విసుక్కుంటూ వున్నా లోపల ఆనందిస్తూ వుంటుందని అందరికీ తెలుసు.

నెమ్మదిగా పర్సనల్ విషయాలు ఏమీ ఎత్తకుండా సినిమాలు పాలిటిక్స్ బుక్స్ చర్చించుకుంటూ కాలం గడిపారు.

"మనం చదువుకుంటున్న రోజుల్లో ఈ తెలంగాణా గొడవతో ఒక సంవత్సరం వృధా అయినట్టే ఈ రాజకీయవేత్తలు మళ్ళీ ఇప్పుడు ఈ పిల్లల భవిష్యత్తుతో ఆటలు మొదలెట్టారు." అంటూ మొదలైన చర్చ ఎక్కడెక్కడికో వెళ్ళి దేశ రాజకీయాల నుండి అంతర్జాతీయ రాజకీయాలు ఒబామా రాజ్యపాలన, అమెరికాలో వచ్చిన రిసెషన్ మూలకంగా భారతీయులు పడుతున్న అగచాట్లు, పిల్లలంతా వలస పోయి ఇక్కడ వంటరిగా మిగిలిపోయిన వృద్ధుల మనోవేదనల వరకు కొనసాగింది.

భోజనాల తరువాత మగవాళ్ళూ పిల్లలు బయటికి వెళ్ళిపోయినారు.

"అవునూ! మీకు అసలు నా ఆచూకీ ఎట్లా తెలిసిందే?" అంతవరకు అడుగుదామని సమయం కోసం వేచి వున్న కుసుమ అడిగింది.

"అదేంటే నువ్వేగా పత్రికా ముఖంగా మమ్మల్ని కలవమని రాసావు?"

"మైగాడ్. అదా! ఏదో రాసానే కాని దాని గురించి అప్పుడే మర్చిపోయాను. అది మీరు చదివారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును కుసుమా, నువ్వు అంత ఆర్తిగా రాసిన ఆ కవిత పూర్ణిమ చేతిలో పడింది తెలుసా?" అంటూ వివరించింది తరుణి.

"కుసుమా, నీ పెళ్ళయిం తరువాత నీతో కాంటాక్ట్ మెల్లిగా తగ్గిపోతూ అసలికి మాయమైపోయినావు. నువ్వు మీ ఆయనతో అమెరికా వెళ్ళిపోయి వుంటావనుకున్నాము. ఇంతకాలం ఎక్కడున్నావు? మీ ఆయన ఏం చేస్తున్నారు? నువ్వు అంత వేదనతో ఆ రచన రాయవలసిన పరిస్థితులు ఎందుకు వచ్చాయి?"

"అంత బాధలేమీ లేవే. ఏదో రాద్దామని అనిపించింది. రాసాను అంతకన్నా ఇంకేమీ లేదు. ఆ పిచ్చి రాతను పట్టుకొని మీరంతా ఏదేదో వూహించేసుకొని బాధ పడుతున్నారా? పిచ్చి మోహల్లారా?" నవ్వేస్తూ కొట్టి పారేయబోయింది.

"వద్దు. ఇంక నిన్ను నువ్వు ఆత్మ వంచన చేసుకొనే ప్రయత్నం చేయవద్దు. ఏమీ లేకుండానే డిప్రెషన్ లోకి వెళ్ళిపోయినావా? అన్నన్ని మందులు మింగే అగత్యం ఏం వచ్చింది? నువ్వు చెప్పావా సరేసరి. లేదంటే నీ కొడుకును పట్టుకొనైనా నిజం తెలుసుకోగలం. కాని మా మీద నమ్మకంతో నువ్వు ఆర్తిగా పిలిచావు. ఆవేశమో ఆవేదనో. ఇంక ఈ ముసుగులో గుద్దులాట ఎందుకు? 'తోడొకరుండిన' అంటూ నువ్వు కోరుకున్నట్టే నీకు మేము వున్నాము. అసలు నీ జీవితంలో ఏం జరిగిందో నిర్భయంగా చెప్పు."

ఒకరి తరువాత ఒకరు కుసుమను నిలవేశారు.

అప్పటిదాకా నిబ్బరంగా వున్న ఆమె ఒక్క సారిగా బర్స్ట్ అయింది. ఎంతకాలంనుండో గుండెల్లో లావాలాగ గూడుకట్టుకొని వున్న అగ్ని పర్వతం బద్దలయింది. ఆమె కన్నీటికి ఆనకట్ట వేయదలుచుకోలేదు. లోపల నిండిపోయిన ఆవేదన బయటికి వెళ్ళిపోతే కాని మాటలు

రావు.  ఎంతసేపు ఏడిస్తే లోపల అంత ప్రశాంతత వస్తుంది. ఆ స్థితి ఏర్పడితేనే  మనసులోని అసలు ఆవేదన మాటల రూపంలో వస్తుంది.

అట్లా కాకుండా దుఃఖం దిగమింగుకుంటే పెదవి మీదనుండి వచ్చే మాటలే కాని హృదయాంతరాళ్ళల్లో వున్న బాధ బయటకు రాదు.

ఇంతకాలం లోపల మోస్తూ వున్నకొండంత బరువు  కొంత తడవుకు దిగిపోయినట్టయింది.

తరుణి లేచి వెళ్ళి చల్లటి మంచినీళ్ళు ఇచ్చింది.

"నిజమే. ఆవేశంలో రాసానో ఆవేదతో రాసానో కాని ఇప్పుడు మంచిపనే చేసానని అనిపిస్తున్నది. నాకు తెలుసు. మీలో ఎవరో ఒకరు చదివి స్పందిస్తారని ఆశ మిణుకుమిణుకు మంటూ వుంది. కాని మూడు నెలలు గడిచిపోయేటప్పటికి దాని విషయమే మర్చిపోయాను. ఇప్పుడు ఆ విషయం మీరు ప్రస్తావించేదాకా గుర్తే రాలేదు."

"చిన్నప్పటి నుండి నా జీవితం అనేకానేక మలుపులు తిరుగుతూనే వుంది. మీ స్నేహంతో సహచర్యంతో ఎన్నో నేర్చుకున్నాను. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ఎదురీదటం నేర్చుకున్నాను. కాని ఇప్పుడు వచ్చిన సమస్యకు మాత్రం పరిష్కారం నా చేతుల్లో లేదని తెలుస్తున్నది." అంటూ మొదలెట్టింది కుసుమ.

తాతయ్య సంబంధం తెచ్చారు. పిల్లవాడు ఇంజనీరు అన్నారు. చూడటానికి బాగున్నాడు. వుద్యోగం మానేయనక్కరలేదని చెప్పారు. ఒక అన్నగారు పెళ్ళైన అక్క వున్నారు తండ్రిలేడు. తల్లి వున్నది. పెద్దగా ఆస్తిపరులుకాక పోయినా సాంప్రదాయమైన కుటుంబం. బాధ్యతలు కూడా ఏమీ లేవు. కట్నం కూడా అక్కరలేదు, మీ అమ్మాయే మాకు కట్నం అన్నారు.

వున్నంతలో పెళ్ళి ఘనంగా చేసారు. ఆ పెళ్ళికి స్నేహితురాళ్ళందరూ కుటుంబాలతో సహా వచ్చారు. జానకమ్మ నాయనమ్మ సాధారణంగా ఎక్కడికి వెళ్ళదు. కాని కుసుమ పెళ్ళనేటప్పటికి వచ్చి ఆశీర్వదించి భోజనం కూడా చేసి వెళ్ళింది. స్నేహితురాళ్ళూ పెళ్ళికొడుకును ఆట పట్టించటానికి ప్రయత్నం చేసారు. కాని అతను వీళ్ళ వేళాకోళాలకు ప్రతిస్పందించకపోగా కాస్త మొహం గంటు పెట్టుకొనేటప్పటికి వూరుకుండిపోయినారు.

పెళ్ళి అనేటప్పటికి అందరి ఆడపిల్లల లాగా కుసుమ కూడా ఎన్నెన్నో కలలుకన్నది.

పెళ్ళంటే ఆమె దృష్టిలో ఒక అందమైన కావ్యం. మనోఫలకం మీద ఎంతో అద్భుతంగా రంగులద్దిన ఒక సుందర దృశ్యం.

కుటుంబమంటే కుసుమకు ముందుగా గుర్తుకొచ్చేది పూర్ణిమ ఇల్లు. అత్తగారంటే, కోడళ్ళను ఒక అమ్మలాగ ఆదరించే జానకమ్మనాయనమ్మ.

కోడళ్ళంటే ఒక తల్లి కడుపున పుట్టారా? అనే భ్రమ కలిగించే సునంద పిన్ని ఆమె తోడికోడళ్ళు.

ఆత్మీయతకు మారుపేరు ఆ ఇల్లు.

అదంతా కుసుమకు ఒక మధురమైన కల. తన సంసారం కూడా అదే విధంగా వుంటుంది అని కోటి ఆశలతో అత్తారింట కాలు మోపింది.

కుసుమను కన్యాదానం చేసిన తాతయ్య బామ్మ ఆనందంలో మునిగి తేలుతున్నారు. నిజంగా కుసుమ పోయిన జన్మలో ఏమి నోములు నోచిందో! ఇంత మంచి అత్తిల్లు దొరికింది అని భావించారు. ఉమ్మడి కుటుంబం. ఒకరికి ఒకరు అండదండగా వుండేలాగా బావగారు తోడికోడలు, ఆడబడుచు కుటుంబం.

పెళ్ళి వరకు ఒక అంకం గడిచింది. ఆ తరువాత కుసుమ జీవితనాటకంలో మరో ఘట్టం మొదలయింది.

పదహారు రోజుల పండుగ వెళ్ళేవరకు విశాఖపట్నంలో అత్తారింట్లో  బంధువులంతా వున్నారు. తోడికోడలు మేనరికం. ఆమె తల్లి

తండ్రి కూడా వున్నారు.

అంతమంది మధ్యలో వున్నా కూడా కుసుమ ఒంటరితనం ఫీలయేది. ఏ పని లేకుండా వూరికే కూర్చోవటం అలవాటు లేదేమో, తను కూడా అత్తగారు తోడికోడలికి ఏదైనా సహాయం చేద్దామన్న వుద్దేశ్యంతో వంటింట్లోకి వెళ్ళింది.

అంతవరకు గలగల కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్న వాళ్ళంతా ఒక్కసారి మౌనంగా వుండిపోయినారు.

"ఏం కుసుమా ఏమైనా కావాలా?" అత్తగారి ప్రశ్నకు సమాధానంగా, "ఏంవద్దు. ఊరికే కూర్చుంటే పొద్దుపోవటం లేదు. నేను కూడా ఏదైనా సహాయం.........."

"ఇంకా నయం కాదూ, కొత్త పెళ్ళికూతురివి, పదహారురోజుల పండుగ వెళ్ళందే ఎంగిలి కంచం కూడా ఎత్తకూడదు. ఆ తరువాత నీ ఇల్లు సంసారం ఎట్లా తప్పవు." అంటూ తోడికోడలి తల్లి వారించి వంటగదిలో నుండి బయటకు పంపేసేటప్పటికి ఇంక చేసేదేమీ లేక గదిలో ఒక్కతే కూర్చుండిపోయింది. కబుర్లు చెప్పేవాళ్ళు లేరు. చదువుదామంటే ఇంటి మొత్తం మీద న్యూస్పేపర్ తప్ప ఒక్క పుస్తకం కూడా కనిపించలేదు.

"అవునే, అంత తోచకపోవటానికి ఏముంది? మీ ఆయన కూడా కొత్తపెళ్ళికొడుకేగా! అతనితో కాలక్షేపం చేయక......" కుసుమ కధనం మధ్యలో ఆపి అడిగింది రేణుక.

"కొత్తపెళ్ళికూతురు ఇల్లు కదలకూడదు, పని చేయకూడదు అన్న నియమాలు నాకు మాత్రమే. అతగాడు పొద్దున కాఫీ టిఫిన్ కానిచ్చి వీధిలో పడితే ఇంక మళ్ళీ భోజనానికే. ఆ తరువాత అమ్మ వదిన అక్కతో కబుర్లు, పడక సాయంత్రం భోజనాలవేళదాకా షికార్లు, యాంత్రికంగా పడక ఎక్కటం. ఇదీ అతని దినచర్య."

"అసలు అతను పెళ్ళెందుకు చేసుకున్నాడో అప్పుడైతే అర్ధం కాలేదు. తరువాత తరువాత తెలిసింది."

వివరంగా తన జీవిత చరిత్ర వినిపించసాగింది కుసుమ.

పదహార్రోజుల పండుగ అయిపోగానే అత్తగారు కొడుకు కోడలితో సహా హైద్రాబాదు వచ్చేసింది.

నెలకొకసారి పెద్దకొడుకు సంసారమో, కూతురు సంసారమో అమ్మను చూడాలన్ననెపంతో రావటం వారం పాటు తిష్ఠవేయటం.

కాపురం పెట్టిన తరువాత కూడా మురహరి ప్రవర్తనలో ఏ మాత్రం మార్పు రాలేదు. అత్తగారింట్లో అంతమంది మధ్య భార్యతో చనువుగా వుంటే బాగుండదని అట్లా దూరంగా వుండిపోయినాడు అనుకున్న కుసుమకు అతను ఇంతే అన్న విషయం తెలియటానికి పదిరోజులకన్నా ఎక్కువ పట్టలేదు.

జీవితమంతా యాంత్రికంగా గడిచిపోవలసిందే అని అర్ధమయింది.

తను వూహించిన వైవాహిక జీవితానికి వాస్తవానికి హస్తిమశకాంతరం.

భర్తలో ఒక జీవితసహచారుడే కాక ఒక మంచి స్నేహితుడిని కూడా చూద్దామన్న ఆశ అడియాస అయింది.

హైద్రాబాదు వచ్చిన నాలుగోరోజున, అంటే పెళ్ళయిన ఇరవయ్యవ రోజున, "కుసుమా, మురహరి రేపటి నుండి ఆఫీసుకు వెళ్ళుతాడట. మరి నువ్వు కూడా రేపటి నుండే వెళ్ళుతావా?" అన్న అత్తగారి మాటలకు ఆశ్చర్యపోయింది.

పెళ్ళి తరువాత వేడుకలు అయిపోగానే భర్తతో కొన్ని రోజులు ఎటైనా తిరిగి వద్దాము, ఆ పైన కొత్త ఇల్లు సర్దుకోవటానికి మరో పదిహేను రోజులు అవసరం వుంటుంది అన్న ఆలోచనతో కుసుమ రెండు నెలలు సెలవు పెట్టింది.

అత్తగారు ఆ మాట అనేటప్పటికి, "తొందర ఏమీ లేదండి. నేను రెండు నెలలు సెలవు పెట్టాను."

ఆవిడ మొహం చిట్లించి, "రెండు నెలల సెలవు దేనికి? అనవసరంగా జీతం నష్టం. నువ్వు కూడా డ్యూటీలో చేరిపో." ఆజ్ఞాపించినట్టే చెప్పింది.

కుసుమ నివ్వెరపోయింది. ఏ అత్తగారైనా కొత్త జంటను ఇంకా కొన్ని రోజులు సెలవు పెట్టి ఎంజాయ్ చేయండి అంటారని తెలుసు. కాని ఈవిడ ఏమిటి? పెళ్ళయిన ఇరవై రోజులలోనే డ్యూటీలో చేరమంటోంది? అనిపించింది.

నిజమే రోజంతా ఈవిడ మొహం చూస్తూ కూర్చోవటం, లేదా గదిలో రేడియో వింటూ కూర్చోవటం తప్ప చేసేదేమీ లేదు. కనీసం బాంక్ కెళ్ళితే ఫ్రెండ్స్ వుంటారు, అన్న అభిప్రాయంతో తను కూడా లీవ్ కాన్సిల్ చేసుకొని డ్యూటీలో చేరి పోయింది.

"హేయ్ కుసుమా, అప్పుడూ వచ్చేసారేమిటి? ఇంకా పెట్టిన గోరింటాకు కూడా ఆరిపోలేదు. ఎక్కడికి హనీమూన్ వెళ్ళలేదా?" అంటూ ఒకరి తరువాత ఒకరు ప్రశ్నల వర్షం కురిపించసాగారు.

"ఆయనకు ఆఫీసులో అర్జెంట్ వర్క్ వుందట. వచ్చే నెలలో పోదామనుకుంటున్నాము." అంటూ పేలవంగా నవ్వి తప్పించుకున్నది.

మడిపేరుతో అత్తగారు వంటింట్లోకి కూడా రానివ్వదు. మురహరి ఎనిమిది తరువాత లేవటం తల్లి ఇచ్చిన కాఫీ తాగటం న్యూస్పేపర్ చదివి స్నానం చేసి తయారయి భోజనం చేసి ఆఫీసుకు వెళ్ళటం. మధ్యాహ్నానికి తల్లి ఏదో ఇంత టిఫిన్ చేసి డబ్బా కట్టి ఇస్తుంది. కుసుమకు అంత పొద్దున్నే అన్నం తినటం అలవాటు లేదు. భర్త వెళ్ళిపోయిన తరువాత ఏదైనా టిఫిన్ చేసుకొని బాంకుకు బయల్దేరుతుంది.

అన్నిటికీ సర్దుకుపోవటం అలవాటైన కుసుమ వాళ్ళ ప్రవర్తన అంతే కామోసు అనుకొని దానికి కూడా సర్దుకుపోవటం అలవాటు చేసుకుంది.

భర్త భోజనం చేసే సమయంలో తాను కూడా తయారయి అతని పక్కన కూర్చొని ఏదైనా కబుర్లు చెప్పుదామని ప్రయత్నించింది. అతను వూరికే ఊ కొడుతూ వినే వాడు.

ఒకరోజు అట్లాగే పక్కన కూర్చున్న కుసుమను, "ఎందుకే కుసుమా వాడు అన్నం తిన్నంతసేపు ఏదో ఒకటి మాట్లాడి విసిగిస్తావు? వాడిని ప్రశాంతంగా అన్నం తిననీయి. అయినా నువ్వు అట్లా వాడి పక్కనే ఎందుకు ముద్దలు లెక్క పెట్టుకుంటూ? దిష్టి తగిలేను." అని అత్తగారు పక్కన కూర్చొనే అవకాశం కూడా లేకుండా చేసింది.

భర్తకు కబుర్లు చెప్పుతూ వడ్డిద్దామన్న కోరిక అవతల పెట్టి భోజనం చేసేటప్పుడు పక్కన కూర్చోను కూడా కూర్చో కూడదన్న ఆర్డర్. శ్రీహరి బాబాయికి దిష్టి తీసే నాయనమ్మ గుర్తుకొచ్చి ఏడవలేక మనసులోనే నవ్వుకుంది. ఆప్యాయంగా పిల్లవాడికి దిష్టి తగిలిందే అని ఆరాటపడే ఆవిడ ఎక్కడ? కొడుకు పక్కన కోడలు కూర్చుంటేనే ఏడ్చిపోయే ఈ మనిషి ఎక్కడ?

ఫస్ట్ తారీఖు వచ్చింది. "కుసుమా, ఇదిగో ఇంట్లోకి కావలసిన వెచ్చాల లిస్ట్. సాయంత్రం బాంక్ నుండి వచ్చేటప్పుడు తెస్తావో? వచ్చి మళ్ళీ వెళ్ళుతావో? నీ ఇష్టం. రాత్రికి ఈ సరుకులు తెచ్చి పెట్టేయి." ఆర్డర్.

అమ్మయ్య. కనీసం ఈ విధంగానైనా ఏదో పని పెట్టుకోవచ్చు. అట్లాగే పాటించింది.

తెల్లారింది. "కుసుమా, ఇంటి ఓనర్ వస్తాడు. అద్దె డబ్బులు ఈ రోజు ఇవ్వాలి. అట్లాగే ఇదిగో కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు. ఇవి కూడా పోతూపోతూ కట్టేసిపో. వస్తూ వస్తూ మార్కెట్ కెళ్ళి కూరలు తీసుకొనిరా."

కొన్ని నెలలు అన్ని పనులు ఆనందంగానే చేసింది కుసుమ. రాను రాను అనుమానం వస్తున్నది. ఇంటి ఖర్చు మొత్తం తానే భరిస్తున్నది. మురహరి చేతి నుండి ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టలేదు. అచ్చంగా తన జీతంతో ఇల్లు గడవటం అంటే ఏదో బొటాబొటీగా నడపొచ్చు. కాని మధ్యమధ్యలో వచ్చే బావగారి కుటుంబం, ఆడబడుచు కుటుంబం అంతా కలిపి తడిపి మోపెడౌతుంది.

ప్రతిరోజూ ఏదో ఒక కూరా పప్పుతో గడిపే భోజనం వాళ్ళెవరైనా వచ్చేటప్పటికి అంతులేని వంటలు ఖర్చు. అంతేకాక వాళ్ళు

వెళ్ళేటప్పుడు పెట్టుపోతలు, పట్టుకెళ్ళటానికి పిండివంటలు.

"కుసుమా, నీ ఆడబడుచు రేపే వెళ్ళిపోతానని కూర్చున్నది. దానికి ఆయనకు పిల్లలకు బట్టలు పెట్టాలి. పెళ్ళయిన మొదటిసారి వచ్చిన చుట్టాలు. కాస్త ఘనంగా తీసుకొనిరా."

"ఏమండీ, వదినగారు రేపెళ్ళిపోతారట. బట్టలు పెట్టాలి. కాస్త తొందరగా వస్తే మనిద్దరమూ షాపింగ్‌కెళ్ళిరావచ్చు." ఆఫీసుకెళ్ళే ముందర భర్తతో ఏకాంతంలో అడిగింది.

"సరే, ఆ విషయం మీరు ఆడవాళ్ళు చూసుకోవాల్సినవి. నాకు చెప్పటం దేనికి? సాయంత్రం వాళ్ళను బజారు తీసుకొని వెళ్ళి కావలసినవేవో కొని పెట్టు." అని వెళ్ళిపోయాడే కాని ఆ ఖర్చుకయ్యే డబ్బు విషయం ఎత్తను కూడా లేదు.

ఇంక చచ్చినట్టు అందరిని వెంటపెట్టుకొని బజారుకెళ్ళి ఘనంగా బట్టలు కొనిపెట్టింది.

ఇల్లు గడవటానికి, ఇటువంటి పైన వచ్చి పడుతున్న ఖర్చులకు తనకొచ్చే జీతం ఏ మూలకూ చాలక పోవటంతో పెళ్ళి ముందు నుండి బాంకులో దాచుకుంటున్న సేవింగ్స్ నుండి తీయవలసి వస్తూ వున్నది.

భరించేవాడు భర్త అని అంటారు. కాని ఇక్కడ అది వ్యతిరేకంగా వుంది. భార్య జీతమంతా ఖర్చు పెడుతుంటే అతను ఒక చుట్టం లాగా సమయం గడిపేస్తున్నాడే కాని ఒక్కసారి కూడా ఇల్లు ఎట్లా గడుస్తున్నదో అడగను కూడా అడగ లేదు.

ఆ విధంగా పెళ్ళి భర్త అన్నమాటకు అర్థమే మారిపోయినట్టు ఇల్లంతా ఒక్క చేత్తో భరించవలసి వస్తున్నది.

అప్పటి దాకా జరిగిన విషయాలు చెప్పుతూ వున్న కుసుమ అలిసి పోయినట్టు అయి ఆగింది.

"మరి ఇంత జరుగుతున్నా ఈ విషయాలు ఎవరితోటీ ఎందుకు చెప్పకుండా నీలో నువ్వే బాధ పడవలసిన అవసరం ఏం వచ్చింది? అటు తాతయ్య బాబాయికి కాని, కాకపోతే మేమందరమూ వున్నాము కదా! మాతోగాని పంచు కోవాలి అనిపించలేదా?" కొద్దిగా కోప్పడుతున్న ధోరణిలో అడిగింది తరుణి.

"మన దిక్కుమాలిన పెంపకాలు వున్నాయి కదే! సంసారం గుట్టు రోగం రట్టు అనుకుంటూ పెద్దవాళ్ళు చెప్పిన నీతులు బాగా బుర్ర కెక్కి కూర్చున్నాయి.

అదీ కాక పెళ్ళయిన కొత్తల్లో కొద్దిగా బెంగగా అనిపించి ఒకసారి ఆ తల్లీ కొడుకులు భోజనాలు చేస్తుంటే అప్పటికి నోరు విడిచి అడగను కూడా అడిగాను, నాకు మావాళ్ళను చూసి రావాలని వుంది ఒక ఆదివారం పోయి వస్తాను అని.

వెంటనే మా అత్త అందుకొని, "అట్లా చీటికి మాటికి పుట్టింటి మీద బెంగ అనుకుంటూ పోతే అసహ్యంగా వుంటుంది. అయినా వచ్చేది ఆదివారం ఒక్కరోజే సెలవు. ఆ రోజు అబ్బాయి కూడా ఇంట్లోనే వుంటాడు. వాడిని ఇంటి దగ్గర వదిలేసి ఇప్పుడు పుట్టింటికి వెళ్ళకపోతే ఏం" అని అడ్డుపడ్డది.

ఆవిడ అన్నట్టు ఆదివారాలు అతను ఇంటిపట్టున వుండే ప్రసక్తే లేదు. సెలవు వచ్చిందంటే చాలు రోజుటి కన్నా పెందరాడే బయటికి వెళ్ళేవాడు. మళ్ళీ ఏ రాత్రికో కొంప చేరటం.

పెళ్ళయిన మొదటేడు కొత్తగా పెళ్ళయిన ఇంటి ఆడపడచును అల్లుణ్ణి పండుగలకు పిలుద్దామని తాతయ్య వాళ్ళు ఎంతో వుబలాట పడ్డారు. ఫార్మల్‌గా ఇన్వైట్ చేయటానికి తాతయ్య బాబాయి వచ్చారు.

"ఆ ఫార్మాలిటీస్ అన్ని ఇప్పుడు ఎందుకండి." అంటూ మురహరి, "అయినా మా అమ్మ ఒక్కతిని ఇంటి దగ్గర వదిలేసి రావటం.........."నసిగాడు.

"అదేంటి మురహరీ, మీ అమ్మ గారు కూడా మీతోపాటే. అసలు మీ అన్నగారు అక్క కుటుంబాలు కూడా తొలి పండుగలకు వస్తే

బాగుంటుంది. కాని పొరుగూరు కదా, కనీసం మీ ముగ్గురైనా వస్తే మాకు సంతోషం." అంటూ తాతయ్య ఆవిడను కూడా మర్యాదగా ఆహ్వానించాడు.

"వద్దులేండి. మా కుటుంబాలలో మాటిమాటికి వియ్యాలవారి ఇంటికి వెళ్ళితే ఆక్షేపిస్తారు. అయినా పండుగ పూట ఇంటికి తాళం పెట్టి వుంచటం ఇంటికి మంచిది కాదు." అంటూ తిరస్కరించేటప్పటికి పండగ నాడు కూడా పుట్టింటికి వెళ్ళే ప్రాప్తం లేకపోయింది.

ఆ సంఘటన తరువాత  పుట్టింటి వాళ్ళు ఇంటికి రావటానికి సాహసించలేదు. ఎప్పుడైనా తాతయ్యగాని బాబాయిగాని బాంకుకు ఫోన్ చేసి మంచి చెడు కనుక్కునే వారు.

బాబాయికి ఒంగోలుకు ట్రాన్స్ఫర్ అవటం, అందరూ అక్కడికి షిఫ్ట్ అవటం జరిగింది.

"ఇంక మిమ్మల్ని కలవాలని నా సమస్యలు మీకు చెప్పుకోవాలని ఎంతగానో ఆశించాను. కాని దానికి కూడా వాళ్ళ దగ్గరనుండి అటువంటి రెస్పాన్సే వచ్చింది." అని చెప్పి ఆపింది కుసుమ.

అసలు ఆ రోజు తన ఫ్రెండ్స్ ప్రస్తావన వచ్చినప్పుడు ఆ తల్లి కొడుకులు అన్న మాటలు ఏవీ వాళ్ళకు చెప్పలేదు. ఇన్ని సంవత్సరాల తరువాత ఆ విషయాలు చెప్పి వాళ్ళ మనసులు పాడు చేయాలని అనిపించలేదు. కాని ఒక్కొక్క మాట తన చెవిలో గింగురుమంటూనే వున్నాయి.

"నీ ఫ్రెండ్స్ అంటే ఎవరు? పెళ్ళికి వచ్చి వెకిలి గోల చేసిన వాళ్ళేనా? ఛీఛీ. వాళ్ళసలు ఆడపిల్లలేనా? ఎప్పుడూ మగాడి మొహమే చూడనట్టు మీదమీద పడటం. మాటిమాటికి విరగబడి నవ్వటం, అసహ్యం వేసింది." కొడుకు మాటలకు వంత పాడుతూ ఆవిడ, "ఎంత స్నేహితులైతే మాత్రం, పెళ్ళికి పిలవగానే మందలుమందలగా తరలి వస్తారా?

ఆ పెద్దమనిషెవరో, పెద్ద బడాయిగా బంగారపునెక్లెసూ పట్టుచీరా తెచ్చి తన డాబు ప్రదర్శన చేస్తే, ఆముసలమ్మ తన మనుమరాలి పెళ్ళన్నంత హడావుడి చేయటము, అవిడ కోడళ్ళు పెత్తనం అంతా నెత్తిన వేసుకొని, మూడు రోజులు పెళ్ళి మంటపంలోనే తిష్ట వేయటం. అంతా లేకి మనుషుల లాగా వున్నారు."

ఆ మాటలు విన్న తరువాత కుసుమ ఫ్రెండ్స్ గురించి మర్చిపోవటానికి నిశ్చయించుకున్నది.

యాంత్రికంగా సాగిపోతున్న సంసారంలో గొడ్డలిపెట్టులా కుసుమకు నెలతప్పినట్టు తెలిసింది. సంసారమంటేనే ఏమిటో అర్ధం కాని స్థితిలో వున్న కుసుమకు అయోమయంగా వున్నది. ఆనందించాలో విచారపడాలో తెలియటంలేదు.

అత్తగారూ భర్త ఏదో గుసగుసలాడుకోవటం తనను చూడగానే మౌనంగా వుండిపోవటం చూస్తుంటే ఏదో గూడుపుఠాణీ జరుగుతున్నట్టు అనిపిస్తోంది.

ఆ రోజు ఆఫీసు నుండి త్వరగా వచ్చిన భర్తను చూసి ఆశ్చర్య పోయింది. అతను రాగానే అత్తగారు, "కుసుమా నేను గుడికి వెళ్ళి వస్తాను." అంటూ బయల్దేరింది.

"కుసుమా తలనొప్పిగా వుంది. ఒక కప్పు కాఫీ పట్రా."

కాఫీ తాగి షూస్ కూడా విప్పకుండా మంచానికి అడ్డంగా పడుకొని మొహం మీద మోచేయిపెట్టుకొని పడుకున్న మురహరి కనిపించాడు.

"ఏమయింది, ఒంట్లో బాగాలేదా?" నుదుటి మీద చేయి పెట్టి చూసింది.

అతను గబుక్కున  కుసుమ చేయి పట్టుకొని, "పక్కన కూర్చో కుసుమా." అని ఆమె వళ్ళో తల పెట్టుకొని పడుకున్నాడు.

ఎప్పుడూ తనంత తాను ఒక్క మాట కూడా మాట్లాడని అతను అట్లా ప్రవర్తించేటప్పటికి ఏమయిందో అని కుసుమకు కంగారేసింది.

"కుసుమా! నేనెంత స్వార్ధపరుడినో కదా, పెళ్ళయిన దగ్గర నుండి నిన్ను ఏ విధంగా సుఖ పెట్టలేకపోయిన దుర్మార్గుడిని కదా? చివరకు నీకు గుప్పెడు అన్నం కూడా పెట్టలేని అసమర్ధుడిని ! పూర్తిగా నీ సంపాదన మీదే ఆధారపడ్డ అధమస్తుడిని." మొహం పైకి ఎత్తకుండా మాట్లాడుతున్న మురహరిని ఎట్లా అర్థం చేసుకోవాలో కుసుమకు తెలియటం లేదు. మౌనంగా వుండిపోయింది. "ఛీ నేనసలు మనిషినే కాదు." అంటూ తనను తాను తిట్టుకుంటూ ఒక ప్రేలాపన లాగా మాట్లాడటం వింటుంటే కుసుమకు అయోమయంగా వుంది.

"నిజం చెప్పేస్తాను కుసుమా. నా జీవితంలో ఒకటే ధ్యేయం. అమెరికాకు వెళ్ళి పై చదువు చదవాలన్నదే నా కోరిక. దాని కోసమే పైసాపైసా కూడపెడుతున్నాను. ఇన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు నాకు అక్కడ యూనివర్సిటీలో సీట్ వచ్చినట్టు ఈ రోజే లెటర్ వచ్చింది."

"నిజమా, ఇంత మంచి వార్త అంత బాధ పడుతూ చెప్పటం ఏమిటి? వుండండి ఇప్పుడే మీ నోరు తీపి చేస్తాను." అతన్ని వళ్ళో నుండి లేపటానికి ప్రయత్నిస్తూ తను లేవబోయింది.

"వద్దు కుసుమా, ఇది అంత మంచి వార్తేమీ కాదు. నీతో, పుట్టబోయే మనబిడ్డతో గడపాల్సిన సమయం నా కల నిజం చేసుకోవాలన్న స్వార్ధంతో దేశం వదిలి పోలేను."

నవనీతం లాగా వున్న కుసుమ మనసు అతని సెంటిమెంట్ వేడికి మెల్లిమెల్లిగా కరగటం మొదలెట్టింది. "అయ్యో పాపం అతను తన పై చదువుల గురించి టెన్షన్లో వుంటే తను అర్ధం చేసుకోకపోగా అపార్ధంచేసుకొని తిట్టుకున్నది." అంటూ పశ్చాత్తాప పడసాగింది.

"మంచివారే. ఇంత చిన్న విషయం గురించి మీ బంగారు భవిష్యత్తు పాడు చేసుకుంటారా? రెండు సంవత్సరాలు ఎంతలో గడిచిపోతాయి? మీరు డిగ్రీ చేతిలో పెట్టుకొని వచ్చేటప్పటికి మీ బిడ్డతో సహా నేను మిమ్మల్ని ఆహ్వానించటానికి సిద్ధంగా వుంటాను."

"అదంతా అయ్యే పని కాదులే కుసుమా."

"ఏమిటండీ నేనింత చెప్పుతున్నా కూడా మీరు నిరుత్సాహంగా మాట్లాడుతారు?"

"లేదు కుసుమా. అదొక్కటే కారణం కాదు. అక్కడ నా చదువు పూర్తయ్యేటప్పటికి చాలా ఖర్చవుతుంది."

"అక్కడంతా చదువులతో సమానంగా వుద్యోగం కూడా చేస్తూ వుంటారు కదండీ." అప్పటికే పూర్తిగా కరిగిపోయిన కుసుమ అతని మాటల ప్రభావంలో పూర్తిగా పడిపోయింది.

"అందరికి అంత అదృష్టం వుండదు కుసుమా. నాకు సీటు వచ్చిన యూనివర్సిటీలో చదువు పూర్తయ్యేదాకా ఎటువంటి ఫుల్టైం కాని పార్ట్టైం కాని జాబ్ చేయకూడదని కండిషన్. అదొక్కటే కాదు. అక్కడ వున్నంత కాలం నా నివాసం భోజనం కాలేజి ఫీజు పుస్తకాలు అన్ని ఖర్చులు స్వయంగా భరించవలసి వుంటుంది. కొంత ధనం అయితే కూడపెట్టగలిగాను కాని అది విమానం చార్జీలకే సరిపోదు. వూళ్ళో వున్న ఇల్లు అమ్మితే కొంతన్నా వూరటగా వుంటుందేమో కాని అది వుమ్మడి ఆస్తి. అమ్మటానికి అన్నయ్య ససేమిరా ఒప్పుకోవటం లేదు. వాడికి ఎదుగుతున్న ఆడపిల్ల వుంది. వున్నదంతా అమ్ముకుంటే రేపు దాని పెళ్ళికి ఇబ్బంది పడవలసి వుంటుందని ఒప్పుకోవటం లేదు.

అయినా అది కూడా సబబే కదా! పోనీలే అదంతా మన వల్ల అయ్యే పని కాదు కాని ఆ సంగతి వదిలేయి. ఇంక నేను కూడా ఇంటి భాధ్యత తీసుకొని నీకు రెస్ట్ ఇస్తాను. నువ్వు నీ ఆరోగ్యం చూసుకొని పండంటి బిడ్డను కను. అందరం ఆనందంగా కాలం గడిపేద్దాం. ఇంక ఈ సంగతి ఇంతటితో వదిలేయి. అందని వాటి కోసం అర్రులు చాచటం మంచిది కాదు."

అయిపోయింది. అప్పటికే నెమ్మదిగా కరుగుతున్న కుసుమ మనసు పూర్తిగా కరిగి నీరయిపోయింది. భర్త మీద సానుభూతి ఇబ్బడిముబ్బడిగా పెరిగింది.

కొంత సేపు ఆలోచనలో పడింది. "ఏమండీ, దీనికి అంత ఆలోచించాల్సినదేముంది? నా పేరు మీద డిపాసిట్స్ వున్నాయి కదా!

ఇంక వేరే ఎక్కడి నుంచో డబ్బు కోసం తంటాలు పడవలసినదేముంది?" అమాయకంగా అన్నది.

"ఛీఛీ. కుసుమా నీ కళ్ళకు నేనెట్లా కనిపిస్తున్నాను? భార్య పుట్టింటివారు ఇచ్చిన ఆస్తి మీద ఆధారపడి నేను పై చదువులకు వెళ్తానని ఎట్లా అనుకున్నావు? అంత దిగజారిపోయానా?" కోపంతో మండిపడ్డాడు.

"అయ్యో అంత కోపం దేనికండీ? పెద్దవాళ్ళు ఏమి చేసినా మన మంచికే చేస్తారంటారు. ఆ నాడు నా పేర మీద వున్న ఆస్తినంతా ఆశ్రమానికి రాసేస్తాననంటే తాతయ్య శ్రీహరి బాబాయి వారించి కొంత మటుకే ఆశ్రమానికి ఇచ్చి మిగతాది నా పేరనే వుంచేసారు. బహుశా ఈ సత్కార్యానికేనేమో!

అయినా పెళ్ళయిం తరువాత నీది నాది అని ఏమీ వుండకూడదు. ఇద్దరమూ ఒకటే అని భావిస్తేనే సంసారాలు సుఖమయమవుతాయి. ఏనాడైతే మనిద్దరికి వివాహం జరిగిందో, ఆనాటి నుండి నాది అన్నపదం మర్చిపోయాను. కనుక ఎటువంటి సంకోచం లేకుండా బాంక్ లో వున్న ఆ మొత్తాన్ని వినియోగించి మీ పై చదువులు కొనసాగించండి." నచ్చ చెప్పింది.

"ఏమో కుసుమా నువ్వు అంతగా చెప్పుతున్నా నాకెందుకో ఆడబ్బు వాడటానికి మనస్కరించటం లేదు. ఈ సంగతి కనుక మా అమ్మకు కాని అన్నయ్యకు కాని ఇతర బంధువులకు కాని తెలిస్తే నా మొహాన పేడ నీళ్ళు కొడతారు. మీ పుట్టింట్లో తెలిస్తే ఎంత అప్రదిష్ట? వద్దు ఆప్రయత్నం మానుకో."

"చూడండి. ఇది మనిద్దరి మధ్య జరిగే విషయం. భార్యాభర్తల మధ్య జరిగే ప్రతి విషయం మూడో వ్యక్తికి తెలియాల్సిన అవసరం లేదు. అది మీ అమ్మ అన్నకు కాని, మాపుట్టింటి వాళ్ళకు కాని చెప్పనక్కరలేదు. రేపే ఇద్దరమూ బాంకుకు వెళ్ళి దానికి సంబంధించిన ఏర్పాట్లు చేద్దాము."

"సరే కుసుమా నువ్వు అంతగా చెప్పుతుంటే కాదనలేకపోతున్నాను. అయితే ఒక కండిషన్. నా చదువు అయిపోయిన తరువాత తీసుకున్న మొత్తం పైసాపైసా తీర్చేస్తాను. ఆ ఒప్పందం మీద అయితేనే తీసుకుంటాను."

చకచక ఏర్పాట్లన్నీ పూర్తయిపోయాయి. ఎప్పటి నుండి ఏర్పాట్లు చేసుకుంటున్నాడొ ఏమో! అయిదు నెలల గర్భం, బాంకులో మినిమమ్ బాలెన్స్‌తో నిలబడ్డ కుసుమకు వీడ్కోలు చెప్పి సప్తసముద్రాలు దాటి తన ధ్యేయం దిశగా ఎగిరిపోయినాడు.

కుసుమ తన కధనం కొనసాగించింది. "అంతే. ఆ వెళ్ళటం మళ్ళీ రెండు సంవత్సరాల తరువాత తిరిగి వస్తాడు, బిడ్డతో సహా ఆహ్వానించి మంచి జీవితం గడుపుతానని ఆశతో విమానాశ్రమంలో ఇచ్చిన ఆ వీడ్కోలే నా సాంసారిక జీవితానికి శాశ్వత వీడ్కోలు అన్న విషయం రియలైజ్ చేయలేకపోయాను." మాట రాక గొంతుపూడుకుపోతున్నది.

అప్పటిదాకా మౌనంగా వింటూ వున్న శ్రోతలు ఒక్కసారి వులిక్కి పడ్డారు.

"ఏమిటి కుసుమా నువ్వనేదీ?" ముందరగా తేరుకున్న రేణుక అడిగింది. "నీకు డెలివరీ అయినప్పుడు మీ అత్తగారే కదా నీకు తోడున్నది!"

"అదంతా వాళ్ళాడిన నాటకంలో ఒక భాగం. ఇదంతా ఒక పధకం ప్రకారం జరిగిందని బాబు పుట్టిన దాకా తెలియలేదు."

కుసుమ పెద్ద మేనమామ ఇంటి పక్కన ఉన్న బంధువులద్వారా కుసుమ తల్లి తండ్రులు మరణించటం, తండ్రికి వున్న ఆస్తి మొత్తానికి ఆమె ఏకైక వారసురాలవటం, కొంత దాన ధర్మాలకు వినియోగించినా ఆమె పేరు మీద బాగానే ఆస్తి వుండటం మొదలైన వివరాలు తెలుసుకున్న మురహరి కుటుంబ సభ్యులకు, అంటే అతనితో సహా అతని తల్లి అన్నగారు అక్కకు కూడా కుసుమ ఆస్తి మీద కన్ను పడ్డది.

మురహరి చెప్పినట్టు అతని ఏకైక ధ్యేయం అమెరికాకు పోవటమే. ఆ రోజులలో అమెరికాకు వెళ్ళటం అంటే ఎంతో ఖర్చుతో కూడిన

పని. ఇప్పటిలాగా బాంక్ లోన్లు అవి అంతగా వుండేవి కావు. ఎంతో ధనవంతులైతే తప్ప ఆ కోరిక తీర్చుకోలేరు. కట్నం తీసుకుంటే అది ఏ మూలకూ సరిపోదు. అందుకనే కట్నం వద్దని ఆదర్శవంతులుగా సంఘంలో పేరు, ఆనిక్కి ఆస్తంతా చేజిక్కించుకునే అవకాశం.

వారి పథకం నూటికి నూరుశాతం విజయమయింది. మురహరి అమెరికాకు వెళ్ళిపోయినాడు. పుట్టింటి వాళ్ళు ఎవరూ వూళ్ళో లేరు. ఆ సమయంలో కడుపుతో వున్న కోడలిని ఒంటరిగా వదిలేస్తే తమ పన్నాగం బయటపడుతుందని భయపడ్డారో? లేకపోతే నిజంగానే ఇంటి వారసుడి మీద ప్రేమో? అత్తగారు మాత్రం కుసుమ పురుడయ్యేదాకా అక్కడే వుండిపోయింది.

అప్పటికి కుసుమను పురిటికి తీసుకు వెళ్ళటానికి వస్తామని తాతయ్య వుత్తరం వ్రాసి, బాబాయిని పంపించారు.

కాని ఆవిడ, "అదేంటి నాయనా! నా కొడుకు దేశంలో లేకపోయినా పుట్టబోయే మనుమడి కోసం నేను కోడలిని కనిపెట్టుకొని ఇక్కడే వున్నాను. మీ అమ్మగారు వయసులో పెద్దవారు. ఈ వయసులో మనుమరాలి పురుడని ఆవిడను ఇబ్బంది పెట్టటం నాకు ససేమిరా ఇష్టం లేదు. అయినా మీ అమ్మాయిని నేను సరిగ్గా చూసుకోలేనని నా మీద అనుమానమా?" అంటూ సెంటిమెంట్ మీద దెబ్బకొట్టేటప్పటికి కుసుమతో సహా బాబాయి కూడా ఆమాటలకు పడిపోయినారు.

అప్పటికి మురహరి దేశం వదిలి నాలుగునెలలు. వెళ్ళిన తరువాత వారానికి ఒకసారి ఉత్తరం వచ్చేది. ఆ రోజులలో వుత్తరం వస్తేనే సమాచారం. ఇంక వేరే మార్గం లేదు. అతను కుసుమ ఆరోగ్యం గురించి చాల కన్సర్న్ చూపిస్తూ రాసే వుత్తరాలు చదువుకుంటూ కుసుమ మురిసిపోయేది. చూస్తూ వుండగానే రెండేళ్ళు ఎంతలో గడిచిపోతాయి, మీరు మటుకు మా గురించి దిగులు లేకుండా బాగా చదువుకోండి అంటూ సమాధానాలు వ్రాసేది.

పురిటి సమయానికి బావగారు తోడికోడలు అత్తగారికి సాయం వచ్చారు. పండంటి కొడుకును కన్నది. మరుసటిరోజే హాస్పిటల్ నుండి డిస్చార్చ్ చేస్తామన్నారు. అదిగో అదే సమయంలో రేణుక కనిపించింది. స్నేహితురాళ్ళు ఇద్దరూ మాట్లాడుకోవటం చూసిన అత్తగారికి ఏదో తెలియని కంగారు.

"అమ్మాయి కుసుమా! రేపు మంచిరోజు కాదు. మొదటిసారి బిడ్డను తీసుకొని ఇంటికి వెళ్ళేటప్పుడు వర్జ్యం లేకుండా మంచిరోజు చూసుకొని వెళ్ళాలి. నేను వెళ్ళి మాట్లాడి వచ్చాను. డాక్టర్ ఈ రోజైనా వెళ్ళిపోవచ్చన్నారు. పెద్దాడు టాక్సీ తీసుకు రావటానికి వెళ్ళాడు. మనం బయల్దేరుదాము." అనేటప్పటికి,

"అత్తయ్యగారూ, నా ఫ్రెండ్ రేణుక మళ్ళీ వస్తానని వెళ్ళింది. తను వచ్చాక కలిసి మాట్లాడి వెళ్ళుదాము." అంది బ్రతిమిలాడుతున్నట్టు.

"కుసుమా ఏది ముఖ్యమో ఆలోచించు. ఆ అమ్మాయి ఏదో ఎమర్జెన్సీ అని వెళ్ళింది కదా! ఎప్పటికి వస్తుందో ఏమో. అయినా ఆ పిల్ల ఇక్కడే వుద్యోగం చేస్తోంది కదా, ఈ సారి వచ్చినప్పుడు కలవ వచ్చు. పదపద ఆలస్యం అవుతోది." అంటూ హడావుడి చేసి ఆలోచనకు కూడా తావు లేకుండా చేసి బయల్దేరదీసింది.

"రేణూ తరువాత నాకు బాగ అర్థం అయింది. అప్పటిదాకా లేని వర్జ్యాలు, దుర్ముహూర్తాలు సడెన్గా ఎట్లా వచ్చాయో? అది నేను నిన్ను కలిసేటప్పటికి ఆవిడకు ఏదో ఇన్సెక్యూరిటీ డెవలప్ అయినట్టు వుంది. నీతో మాట్లాడితే నేను ఏం చెప్పుతానోనని భయం వున్నట్టు తరువాత అనిపించింది. కాని ఏం లాభం నిస్సహాయంగా ఆవిడతో పాటు బాబును ఎత్తుకొని వెళ్ళిపోయినాను.

బాబుకు మూడవనెల వచ్చింది. తాతయ్య సకుటుంబంగా వచ్చి చూసిపోయినారు. నామకరణం చేద్దామని ఎంతో వుబలాట పడ్డారు.

"అబ్బాయి వూళ్ళో లేకుండా వేడుకలు చేసుకోవటం నాకు ఇష్టం లేదు. వాడొచ్చాక అన్ని వేడుకలు ఒక్కసారే చేద్దాము." అంటూ వాళ్ళ కోరికను తిరస్కరించింది. ఏ వేడుకా లేకుండా బాబును సందీప్ అని పిలుచుకోసాగింది కుసుమ.

అత్తగారికి పసిబిడ్డను అలవాటు చేసి తిరిగి వుద్యోగానికి వెళ్ళటానికి సంసిద్ధురాలయింది కుసుమ.

ఆ రోజు, "అబ్బా కుసుమా! నా మోకాళ్ళు చేతి కీళ్ళు విపరీతంగా నొప్పిపుడుతున్నాయే. ఎప్పుడో నాలుగేళ్ళక్రితం కీళ్ళవాతం వచ్చింది. విపరీతంగా బాధపడ్డాను. పెద్దాడు వాళ్ళ వూళ్ళో ఆయుర్వేద వైద్యం చేయించేటప్పటికి తగ్గింది. ఇదిగో మళ్ళీ మొదలయింది. అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాను. చంటాడిని ఎత్తుకుందామన్నా సాధ్యం కావటం లేదు. మళ్ళీ ఒకసారి ఆ వైద్యం చేయించుకుంటే బాగుంటుందేమో..........."అంటూ మూలగటం మొదలెట్టింది.

"అయ్యో అత్తయ్యా! నేను వచ్చే వారం వుద్యోగంలో చేరాలి. మీరెళ్ళిపోతే............"

"మరెట్లాగమ్మా! నాకేమో చేతకాకుండా వుంది. అవేవో చంటిపిల్లలను చూసుకొనే సెంటర్లేవో వుంటాయట కదా, అక్కడ అలవాటు చేయి. అయినా ముందు వెనక చూడకుండా ఆస్తులు దానం చేయకుండా వుంటే ఈ వుద్యోగాలంటూ వీధిలో తిరిగే అగత్యం వుండేది కాదు కదా! అయినా పెద్దవాళ్ళకు ఆ మాత్రం జ్ఞానం వుండక్కరలేదా? పెళ్ళి కావలసిన ఆడపిల్ల ఆశ్రమాలకు ఆస్తినంతటిని దారాదత్తం చేస్తుంటే వద్దని వారించనక్కరలా. సరేలే అవన్ని తవ్వుకొని ప్రయోజనం ఏముంది? ఏదో మార్గం నువ్వే చూసుకో. లేకపోతే మీ తాతయ్యను నాయనమ్మను సాయంగా పిలిపించుకో" అంటూ ఒక వుచిత సలహా కూడా పారేసి, పెద్ద కొడుకును పిలిపించుకొని ఆవిడ దారిన ఆవిడ వెళ్ళిపోయింది.

నడి సముద్రంలో మునిగిపోతున్న భావన కలుగుతున్నది కుసుమకు. అప్పటికే మురహరి దగ్గర నుండి వుత్తరాలు రావటం కూడా తగ్గిపోయింది. వచ్చినా ముక్తసరిగా ఏవో రెండు ముక్కలు గిలికినట్టు వచ్చేవి.

ఏం చేయాలి. అందరూ వుండి చంటి వాడిని కేర్ సెంటర్లో చేర్చాలా? ఇంక వేరేమార్గం ఏదీ కనిపించలేదు. వుద్యోగం మానేస్తే బతుకు గడిచేదెలా? అన్ని ప్రశ్నలే. ఏ ఒక్క దానికి కూడా సమాధానం దొరకటం లేదు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments